ఫార్ములా రేస్.. షాన్‌దార్ ఇమేజ్

- అంతర్జాతీయ దృష్టికి హైదరాబాద్
- ఇందుకు కేటీఆర్ కృషిని మరువలేం
- అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలపై కేటీఆర్‌ను కలిసి సారీ చెప్పిన
- కేసీఆర్ భోళా శంకరుడు.. గొప్ప నేత
- ఆయన తెచ్చిన పథకాలు చాలా గొప్పవి
- హైడ్రాతో ప్రభుత్వానికి చెడ్డ పేరు
- కాంగ్రెస్‌పై ప్రజలకు నమ్మకం లేదు
- యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే దానం నాగేందర్

హైదరాబాద్, జనవరి 10(నమస్తే తెలంగాణ): ఫార్ములా-ఈ రేస్ వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగిందని ఎమ్మెల్యే దానం నాగేందర్ స్పష్టంచేశారు. కేటీఆర్ చేసిన కృషి వల్ల హైదరాబాద్ అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించిందని కితాబిచ్చారు. అవినీతి ఉన్నదా? లేదా? అనేది తర్వాత విషయమని, ఫార్ములా-ఈ రేస్ హైదరాబాద్‌కు మేలు చేసిందని స్పష్టంచేశారు. ఇందులో కేటీఆర్ అవినీతి ఏమైనా ఉంటే వెంటనే బయటపెట్టాలని, తద్వారా ఈ గొడవ, ప్రజల్లో కన్ఫ్యూజన్ పోతాయని పేర్కొన్నారు. హైడ్రా పేరుతో హైదరాబాద్ ప్రజలను రోడ్డున పడేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై హైదరాబాద్ ప్రజల్లో నమ్మకం లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఒక గొప్ప నాయకుడని, ఆయన భోళా శంకరుడని చెప్పారు. గురువారం ఆయన ఒక యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు కీలక, సంచలన వ్యాఖ్యలు చేశారు. దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు ఆయన మాటల్లోనే..

ఫార్ములా-ఈ రేస్‌తో మంచి జరిగింది

ఫార్ములా-ఈ రేస్ హైదరాబాద్‌కు రావడం మంచి పరిణామం. ఇది హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచిందనడంలో అనుమానం లేదు. రాష్ట్రానికి ఫార్ములా-1 తీసుకొనిరావాలని అప్పట్లోనే సీఎం చంద్రబాబు గచ్చిబౌలిలో భూ సేకరణ చేశారు. ఇందుకోసం అంతర్జాతీయ టీం కూడా ఇక్కడికి వచ్చి పరిశీలించింది. అప్పుడే వస్తుందని అనుకున్నాం. కాని, కొన్ని కారణాల వల్ల ఆగిపోయింది. ఇప్పుడు ఫార్ములా-ఈ రావడం అనేది హైదరాబాద్‌కు మంచిదైంది. హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేందుకు, అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించేందుకు దోహదపడింది. ఇందులో అవినీతి ఉన్నదా? లేదా? అనేది తర్వాత విషయం. అది కోర్టులు తేలుస్తాయి. కేటీఆర్ మాత్రం అవినీతి జరగలేదని, హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచామని చెప్తున్నారు. ఎన్నో సంస్థలు పోటీపడ్డాయని, ఒక దశలో ఫార్ములా-ఈ రేస్ దుబాయ్‌కి వెళ్లే ఆలోచన చేస్తే వాళ్లతో మాట్లాడి.. ఇక్కడికి తీసుకొచ్చి నట్టు తెలిపారు. ఫార్ములా-ఈ రేస్ హైదరాబాద్‌కు తీసుకొనిరావడంలో కేటీఆర్ చేసిన కృషిని కాదనలేం.

కేటీఆర్ అవినీతి ఉంటే బయటపెట్టాలి

కేటీఆర్ అవినీతిని బయటపెడతామని అంటున్నారు. అలా అయితే ఏమైనా అవినీతి ఉంటే వెంటనే బయటపెట్టేయాలి. అలా చేస్తే ఈ గొడవ ఉండదు. ప్రజల్లో లేనిపోని కన్ఫ్యూజన్ క్రియేట్ అవుతున్నది. కాబట్టి, అవినీతి ఉంటే వెంటనే బయటపెట్టేయాలి. అవినీతి లేనట్టు కేటీఆర్ నిరూపించుకుంటే సంతోషమే. లేకపోతే అవినీతి ఉన్నదని ప్రభుత్వం నిరూపిస్తే చట్టమే శిక్షిస్తుంది.

ఆ అధికారుల వల్లే సీఎంకు చెడ్డపేరు

హైడ్రా పేరుతో ప్రజలు వెళ్లే దారిని మూసివేస్తుంటే నేను మాట్లాడటానికి వెళ్లిన. అక్కడ ప్రజలు ఆవేశంతో గోడను కూల్చేశారు. నాపై రంగనాథ్ కేసు పెట్టలేదు. అక్కడ ఒక డీసీపీ ఉన్నారు. ఆయనే సుప్రీం అనుకుంటూ ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగినా దానిని భూతద్దంలో చూపించి తాను నీతిమంతుడినని చూపించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఆ డీసీపీ వల్లనే హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చెడ్డపేరు వస్తున్నది. ఆ డీసీపీ ఒళ్లు దగ్గర పెట్టుకొని పనిచేస్తే సంతోషంగా ఉంటుంది. కానీ, ఎవరిపై పడితే వారిపై కేసులు పెట్టుడు.. 20 ఏండ్ల కింది కేసులు తిరిగి తోడటం చేస్తుండు. పార్లమెంట్ ఎన్నికల్లో నాపై 12 కేసులు పెట్టారు. సుమోటోగా కేసులు పెట్టేస్తున్నారు. అలాంటి అధికారులకు స్వేచ్ఛ ఇస్తే ప్రభుత్వానికి ప్రమాదకరం. నాకేమీ కాదు. అలాంటి అధికారులు వస్తుంటారు.. పోతుంటారు. అలాంటి వాళ్లు నా తలపై ఉన్న వెంట్రుకలంత మందిని చూసిన. అలాంటి ఆఫీసర్లకు నేను భయపడే వ్యక్తిని కాను. ఆయనతూ అంటే నేను తూతూ అంటా. అలాంటి ఆఫీసర్లను లెక్కచేయను. కానీ, సీఎం ఆలోచించుకోవాలి.. అలాంటి వాడు ఉండాలా.. లేదా? అనేది.

హైడ్రా పేరుతో ప్రజలను రోడ్డుపై పడేస్తున్నరు

ప్రజల కోసమే అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉంటూ.. సొంత పార్టీ నిర్ణయాలను వ్యతిరేకించాల్సి వచ్చింది. అధికారంలో ఉంటమా? లేదా? అనేది కాదు.. ప్రజల మధ్య ఎలా ఉన్నాం.. సంబంధాలు ఎలా ఉన్నాయనేదే ముఖ్యం. ఈ అంశంపై అసలు నన్ను ఎప్పుడూ సీఎం రేవంత్‌రెడ్డి మందలించలేదు. ఆయన ఈ టాపిక్ ఎత్తలేదు. ఒకవేళ సీఎం మందలిస్తే.. దానికి దారితీసిన కారణాలను చెప్పేవాడిని. హైడ్రా పేరుతో హైదరాబాద్ ప్రజలను నిర్దాక్షిణ్యంగా రోడ్డుపైకి నెట్టొద్దు కదా. మన ఓటుబ్యాంకు వాళ్లే. మనల్ని కాపాడేదీ వాళ్లు.

గల్లా పట్టి అడిగే దమ్ముంది

బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు నాకు అధికారం లేదు. ఇప్పుడు కూడా నాకు అధికారం కావాలని అడగలేదు.. అడగను కూడా. అధికారం అనేది ముఖ్యం కాదు.. హైదరాబాద్ సిటీలో ఎంత వ్యాల్యూ ఉందనేది ముఖ్యం. పేరుతోనే పనులు జరుగుతాయి. దీనికి అధికారం అవసరమా? దానం నాగేందర్ అనేదే ఒక బ్రాండ్. అంతేగాని, అధికారం ఉంటేనే పనులు జరుగుతాయనేది కాదు. న్యాయపరంగా ఏది ఉన్నా చేయించుకుంటా. పని న్యాయంగా ఉంటే ఎందుకు చేయలేదని గల్లా పట్టుకుని అడిగే సత్తా నాకు ఉన్నది.

కేటీఆర్‌కు సారీ చెప్పిన

ఒక సీనియర్ సభ్యుడిగా అసెంబ్లీలో బూతులు మాట్లాడటం తప్పే.. అది ఆవేశంలో మాట్లాడాను. చాలాసార్లు గొడవలు అయ్యాయి కానీ, ఎప్పుడూ అలా మాట్లాడలేదు. అలా మాట్లాడినందుకు వ్యక్తిగతంగా విచారం వ్యక్తంచేస్తున్నాను. ఇందుకు సంబంధించి కేటీఆర్‌ను స్వయంగా కలిసి సారీ కూడా చెప్పిన.

కేసీఆర్ గొప్ప నాయకుడు... భోళా శంకరుడు

వైఎస్సార్, కేసీఆర్, రేవంత్‌రెడ్డి పాలనను పరిశీలిస్తే, వైఎస్సార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. కేసీఆర్ గొప్ప నాయకుడు. వ్యక్తిగతంగా చాలా మంచివ్యక్తి. ఆయన ఆగ్రహంగా, కోపంగా మాట్లాడొచ్చు.. కాని, ఆయన మనసు సున్నితమైంది. ఒకవిధంగా చెప్పాలంటే కేసీఆర్ భోళా శంకరుడు.

కాంగ్రెస్ కార్యకర్తల్లో నిరుత్సాహం

సీనియర్ లీడర్‌గా సిటీలో పార్టీ పటిష్ఠత కోసం ఇప్పటివరకు నన్ను ఎవరూ సంప్రదించలేదు. సంప్రదించాలని అనుకుంటున్నా. హైదరాబాద్‌లో వ్యాక్యూమ్ ఉన్నది. సిటీలో క్యాడర్‌ను బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్నది. సీఎం అభివృద్ధి కార్యక్రమాలను చేస్తున్నారు కానీ, కాంగ్రెస్ కార్యకర్తలో ఆ స్పందన ఎక్కడా కనిపించడం లేదు. ఆ ఉత్సాహం లేదు. కార్యకర్తలు ఎందుకు నిరుత్సాహంగా ఉన్నారనే అంశంపై దృష్టిపెట్టాలి. కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో నేను పూర్తిగా కలిసిపోయినట్టేనా? అనేది ఉండదు. నేను వాళ్లతో కలిసేదేంటి? వాళ్లే నాతో కలవాలి. నేను సీనియర్‌ను. కాంగ్రెస్ వాళ్లంతా నాకన్నా జూనియర్లే. పాత వాళ్లు కలిశారు.. కొత్త వాళ్లతో పరిచయాలు అవుతున్నాయి. పార్టీ జెండా మోస్తున్న కార్యకర్తలు ఏదో ఒక పదవి దక్కకపోతుందా! అని ఆశగా ఎదురుచూస్తున్నారు. సీఎం సమయం ఇచ్చినప్పుడు వారి గురించి చెప్తాను.

హరీశ్‌ను అరెస్టు చేయొద్దు

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఉత్తర్వులను పొడిగించిన హైకోర్టు

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావుకు మరోసారి ఊరట లభించింది. ఆయనను అరెస్టు చేయొద్దని గతంలో పంజాగుట్ట పోలీసులకు జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను హైకోర్టు పొడిగించింది. ఈ కేసును కొట్టేయాలని, ఈలోగా తనను అరెస్టు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ శుక్రవారం మరోసారి విచారణ జరిపారు. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది జే రామచందర్‌రావు వాదన వినిపిస్తూ.. ఈ కేసులో పోలీసులు దాఖలు చేసిన కౌంటర్‌కు సమాధానమిచ్చేందుకు ఫిబ్రవరి దాకా గడువు కావాలని కోరారు. దర్యాప్తునకు సహకరించేందుకు హరీశ్‌రావు సిద్ధంగా ఉన్నారని, ఇప్పటివరకు పోలీసులు ఆయనను విచారణకు పిలవలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో పిటిషనర్‌ను అరెస్ట్ చేయవద్దని గతంలో జారీ చేసిన ఉత్తర్వులను పొడిగించాలని కోరారు. అందుకు సమ్మతించిన న్యాయమూర్తి.. తదుపరి విచారణను ఈ నెల 28కి వాయిదా వేశారు.

గుండెపోటుతో 8 ఏండ్ల బాలిక మృతి

వారం రోజుల్లో రెండో ఘటన

మొన్న కర్ణాటక.. నేడు గుజరాత్‌లో

న్యూఢిల్లీ, జనవరి 10: గుండెపోటుకు గురై మరో ఎనిమిదేళ్ల బాలిక పాఠశాలలో మరణించింది. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో మూడవ తరగతి చదువుతున్న బాలిక శుక్రవారం పాఠశాలలో గుండెపోటుతో కన్నుమూసింది. ఇదే వారంలో కర్ణాటకలోని చామరాజనగర్‌లో పాఠశాలకు వెళ్లిన ఓ ఎనిమిదేళ్ల బాలిక గుండెపోటుతో మరణించిన ఘటన తెలిసిందే. ఈ విషాద ఘటనను మరువకముందే ఇటువంటిదే మరో ఘటన జరగడం వైద్యులను సైతం విస్మయానికి గురిచేస్తోంది. శుక్రవారం ఉదయం అహ్మదాబాద్‌లోని తాల్‌తేజ్ ప్రాంతంలో ఉన్న జేమర్ పాఠశాలలో గర్గి రన్పారా అనే బాలిక కుర్చీలో కుప్పకూలిపోయింది. వెంటనే సమీపంలోని ప్రైవేట్ దవాఖానకు బాలికను తరలించగా గర్గికి గుండెపోటు వచ్చినట్టు డాక్టర్లు చెప్పారని ప్రిన్సిపాల్ తెలిపారు. బాలికకు వెంటిలేటర్ అమర్చినప్పటికీ ఆమెను వైద్యులు కాపాడలేకపోయారని చెప్పారు.

ఏడాదిలో ఆగమైన ఆదివాసీ గూడేలు

- కేసీఆర్ హయాంలో అభివృద్ధిపథం
- కాంగ్రెస్ పాలనలో అభివృద్ధికిదూరం
- బీఆర్ఎస్ ఒత్తిడితోనే సీఎం హామీలు
- ఆ హామీలను విస్మరిస్తే పోరు ఉధృతం
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ హయాంలో ఎంతగానో అభివృద్ధి చెందిన ఆదివాసీ గూడేలు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలో అభివృద్ధికి దూరమై ఆగమయ్యాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ ఏడాదిలో గూడేలన్నీ అభివృద్ధికి దూరమయ్యాయని, ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీ ఆదివాసీ హక్కులు, సమస్యలపై చేస్తున్న పోరాట ఫలితంగానే ఆదివాసీ సంఘాల నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశమై హామీలు ఇచ్చారని తెలిపారు. ఇది బీఆర్ఎస్ పార్టీ సాధించిన విజయమని చెప్పారు. ఆ హామీలను అమలు చేయకుంటే బీఆర్ఎస్ పోరాటాన్ని ఉధృతం చేస్తుందని హెచ్చరించారు. తక్షణమే ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో గురుకులాలు కుదేలయ్యాయని, విద్యార్థులు భయపడే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తంచేశారు. గురుకులాల్లో విషాహారం తిని విద్యార్థులు మృతి చెందుతున్నా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఐటీడీఏ వ్యవస్థను పటిష్టం చేసి ఆదివాసీ బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు.

తాగునీటి వ్యవస్థ నిర్వీర్యం.. సీజనల్ వ్యాధులతో సతమతం

ఆదివాసీ గూడేల్లో తాగునీటి సరఫరా వ్యవస్థ నిర్వీర్యమైందని, సీజనల్ వ్యాధులతో ఆదివాసీలు సతమతమవుతున్నారని కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్‌తో కలిసి బోథ్, ఆసిఫాబాద్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోని ఆదివాసీ గూడేలను సందర్శించానని తెలిపారు. ఆ సందర్భంగా ఆదివాసీలు ఎదుర్కొంటున్న అనేక కష్టాలను స్వయంగా తాము చూశామని తెలిపారు. సీజనల్ వ్యాధుల కారణంగా అనేకమంది మరణించినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమని, సకాలంలో వైద్యం అందించడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఆదివాసీ పిల్లలకు విద్యను అందించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తుందని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

ఎస్సీ వర్గీకరణకై 48 గంటల దీక్ష

వచ్చే నెల 5, 6 తేదీల్లో చేస్తా: వంగపల్లి

ముషీరాబాద్, జనవరి 10: సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వచ్చే నెల 5, 6 తేదీల్లో దీక్ష చేపట్టనున్నట్టు ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ తెలిపారు. కాలాయపన చేయకుండా వర్గీకరణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్ విద్యానగర్‌లోని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నిండు అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ చేసే మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందని చెప్పి కాలాయపన చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ జిల్లాల్లో తిరిగి వినతి పత్రాలు స్వీకరించిందని చెప్పారు. కాబట్టి కాలయాపన చేయకుండా ఈ అసెంబ్లీ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేదంటే ఈ నెల 20న రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు. ఎస్సీ వర్గీకరణపై బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లోనే బిల్లు పెడితే సరిపోయేదని చెప్పారు.

బీఎల్ ఎన్‌రెడ్డిని ఆరున్నర గంటలు ప్రశ్నించిన ఏసీబీ

హైదరాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ-కార్ రేస్ కేసులో హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఏసీబీ శుక్రవారం మరోసారి విచారించింది. రేస్ నిర్వహణ, నగదు బదిలీపై ఆయనను ఆరున్నర గంటలపాటు సుదీర్ఘంగా ప్రశ్నించింది. ఎప్పుడు పిలిచినా అందుబాటులో ఉండాలని బీఎల్ఎన్ రెడ్డికి స్పష్టం చేసిన ఏసీబీ అధికారులు.. ఆయనను మరోసారి విచారణకు పిలువనున్నట్టు తెలుస్తున్నది.

అక్రమ కేసులకు భయపడేది లేదు

హామీల అమలులో విఫలమై.. డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్న రేవంత్

మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి ఆగ్రహం

నార్కట్‌పల్లి, జనవరి 10 : ప్రతిపక్షంలో ఉండి ప్రజల పక్షాన నిలబడి.. ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని నిలదీస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కేసులు పెట్టడం సరికాదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కేటీఆర్‌పై అక్రమంగా ఫార్ములా-ఈ కేసు పెట్టారని మండిపడ్డారు. శుక్రవారం ఆయన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో మీడియాతో మాట్లాడారు. అక్రమ కేసులు, అరెస్టులతో బీఆర్ఎస్ నేతలను మానసికంగా దెబ్బతీసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఏ రకంగా బెదిరింపులకు పాల్పడిన ప్రజల తరపున పోరాటాన్ని ఆపబోమని స్పష్టం చేశారు. అసమర్థ విధానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఇమేజ్‌ను డ్యామేజ్ చేస్తున్నదని మండిపడ్డారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రకటించినట్టు రైతులకు ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఇవ్వలేదని, రూ.2 లక్షల రుణ మాఫీ పూర్తి చేయలేదని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక రేవంత్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

రూ.210 కోట్ల కరెంటు బిల్లు

హిమాచల్ వాసికి షాక్

సిమ్లా: కాంగ్రెస్ పాలిత హిమాచల్ ప్రదేశ్‌లో కరెంటు బిల్లును చూసి ఓ చిరు వ్యాపారి షాక్‌కి గురయ్యారు. గత నెలకు రూ.210,42,08,405 చెల్లించాలని బిల్లులో పేర్కొనడంతో హమీర్‌పూర్ జిల్లాకు చెందిన లలిత్ ధీమాన్ అవాక్కయ్యారు. 2024 నవంబరులో ఆయనకు రూ.2,500 మాత్ర మే బిల్లు వచ్చింది. ఆయన హుటాహుటిన విద్యుత్తు బోర్డు కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. అధికారులు స్పం దించి, సాంకేతిక సమస్య ఏర్పడిందని చెప్పారు. బిల్లును రూ.4,047కు తగ్గించారు.

కేటీఆర్‌పై మరో కేసు

- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారంటూ పోలీసుల ఫిర్యాదు
- బంజారాహిల్స్ ఠాణాలో కేటీఆర్‌తోపాటు మరో ఐదుగురు నేతలపై కేసు నమోదు

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుపై మరో కేసు నమోదైంది. పోలీసు విధులకు ఆటంకం కలిగించడంతోపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి, ఒక గంటపాటు ట్రాఫిక్ రద్దీకి కారకులయ్యారంటూ కేటీఆర్‌పై బంజారాహిల్స్ ఠాణాలో కేసు నమోదు చేశారు. ట్రాఫిక్ ఎస్సై గోవర్ధన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు బీఎన్ఎస్ 221,292,126(2) రెడ్‌విత్ 3(5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఫార్ములా-ఈ రేస్ కేసులో ఏసీబీ అధికారులు గురువారం విచారణకు పిలవడంతో కేటీఆర్.. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని ఏసీబీ కార్యాలయానికి వెళ్లారు. తిరిగి అక్కడి నుంచి సాయంత్రం సుమారు 5 గంటల ప్రాంతంలో బయలుదేరారు. ఆ సమయంలో తమతో మాట్లాడాలని మీడియా ప్రతినిధులు కేటీఆర్‌ను కోరారు. దీంతో కేటీఆర్ ప్రయాణిస్తున్న వాహనం నెమ్మదిగా వెళ్లింది. అయితే, బందోబస్తులో ఉన్న పోలీసులు ట్రాఫిక్ రద్దీ అవుతుందని, ముందుకు వెళ్లాలని కేటీఆర్‌కు సూచించారు. కేటీఆర్ తన వాహనాన్ని ఆపి మీడియాతో మాట్లాడుతూ.. ట్రాఫిక్‌జామ్ అయినా పట్టించుకోలేదని, ముందుకు వెళ్లమన్నందుకు పోలీసులతో వాగ్వాదానికి దిగారని కేసు నమోదు చేశారు. రోడ్డు నంబర్ 12లోకి వెళ్లిన తరువాత అదనంగా మరో 30 మంది పార్టీ కార్యకర్తలు చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటనలో బీఆర్ఎస్ నేతలు బాల్క సుమన్, మన్నె గోవర్ధన్, గెల్లు శ్రీనివాస్, జయసింహ, క్రిశాంక్‌పై కూడా కేసు నమోదు చేశారు.

రేవంత్‌పై బండికి ఎందుకంత ప్రేమ?

మొదటిపేజీ తరువాయి...

నిజంగా బీజేపీ రక్తమైతే రేవంత్ ప్రజాస్వామిక విధానాలపై పోరాడాలి' అని చురకలంటించారు. బీఆర్ఎస్, కేటీఆర్‌పై బండి సంజయ్ వ్యాఖ్యల పట్ల శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ మధ్య అంతర్గత లావాదేవీలున్నయి. అందుకే సంజయ్‌ని అధ్యక్ష పదవి నుంచి అధిష్ఠానం ఊడబీకిందని బీజేపీ నేతలే అంటున్నరు' అని దుయ్యబట్టారు. 'రాష్ట్రంలో ఒక ప్రతిపక్షంగా ఉన్న బీజేపీ నాయకులు ఇక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీయాల్సింది పోయి, అసెంబ్లీలో మాపైనే దాడి చేస్తున్నరు. బయట కూడా మాపైనే మాట్లాడుతున్నరు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా మోసం చేసినా.. ప్రజలకు ఇండ్లు ఇస్తామని నమ్మబలికి హైడ్రా, మూసీ పేరిట ఉన్న ఇండ్లను కూడా కూల్చి వేస్తున్నా.. అమాయకుల భూములను లాక్కుంటూ ఎదురు తిరిగితే జైళ్లకు పంపుతున్నా.. మహిళలు అని కూడా చూడకుండా అర్ధరాత్రి కరెంటు తీసి జైళ్లకు పంపుతున్నా బండి సంజయ్, బీజేపీ కిమ్మనడం లేదు' అని మండిపడ్డారు. 'దాడులు జరుగుతున్నా, కేసులు పెడుతున్నా అన్నింటినీ ఎదిరించి ప్రజల తరపున పోరాడుతున్న బీఆర్ఎస్‌పైనే బీజేపీ దాడి చేయడం సిగ్గుచేటు. నాడు కవితను అరెస్టు చేయాలని బీజేపీని కాంగ్రెస్, నేడు కేటీఆర్‌ను అరెస్టు చేయాలని కాంగ్రెస్‌ను బీజేపీ కోరడం రెండు పార్టీల సంబంధాన్ని బయటపెడుతున్నది' అని పేర్కొన్నారు. విచిత్రంగా చాలా మంది బీజేపీ నాయకులు, ఎంపీలు లగచర్ల, హైడ్రా విషయంలో ప్రభుత్వానికి మద్దతుగా మాట్లాడారని మండిపడ్డారు. బీజేపీ నాయకులు రేవంత్ ఏజెంట్లుగా పని చేస్తున్నారని, రేవంత్‌రెడ్డి గొంతును బండి సంజయ్ వినిపిస్తున్నాడని నిప్పులుచెరిగారు. 'ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు.. రైతుల తరపున జైళ్లకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నం. ఫార్ములా ఈ రేస్ ఒప్పందం రద్దుతోనే రాష్ట్రానికి నష్టం జరిగింది.. ఈ కేసులో చివరికి రేవంత్‌రెడ్డే జైలుకు వెళ్తాడు రాసిపెట్టుకో' అని జగదీశ్‌రెడ్డి హెచ్చరించారు. 'రేవంత్‌రెడ్డికి, బీజేపీ నాయకులకు.. ప్రత్యేకించి బండి సంజయ్‌కి అంతర్గత, ఆర్థిక సంబంధాలు, భూలావాదేవీలున్నట్టు ప్రపంచం మొత్తానికి తెలుసు. ఆ దందాలు కొనసాగేందుకు రెండు పార్టీలు కలిసి బీఆర్ఎస్‌ను దెబ్బతీయాలనే కుట్రలకు పాల్పడుతున్నయ్. ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తున్న బీఆర్ఎస్‌ను దిగజార్చాలంటే వారి జేజమ్మలు దిగి వచ్చినా కాదు' అని హెచ్చరించారు.

> రేవంత్‌రెడ్డికి, బీజేపీ నాయకులకు.. ప్రత్యేకించి బండి సంజయ్‌కి అంతర్గత, ఆర్థిక సంబంధాలు, భూలావాదేవీలున్నట్టు ప్రపంచం మొత్తం తెలుసు. ఆ దందాలు కొనసాగేందుకు రెండు పార్టీల నాయకులు కలిసి బీఆర్ఎస్‌ను దెబ్బతీయాలని కుట్రలు చేస్తున్నరు. వారి జేజమ్మలు దిగివచ్చినా అది సాధ్యం కాదు.
>
> - జగదీశ్‌రెడ్డి

సర్కార్‌పై చేనేత గర్జన

ఈ నెల 20న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి

ఫిబ్రవరి 25వ తేదీన చేనేత గర్జన సభ

సమస్యలు పరిష్కరించాలని అల్టిమేటం

లేదంటే పోరుబాటు తప్పదని హెచ్చరిక

హైదరాబాద్, జనవరి 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో చేనేత వస్త్ర కార్మికులు పోరుబాట పట్టారు. ఏడాదికాలంగా అపరిష్కృత సమస్యలను పరిష్కరించకుంటే పోరాటం తప్పదని సర్కారుకు అల్టిమేటం ఇచ్చారు. సర్కారు తమ సమస్యలను తీర్చకుంటే ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం చుడుతామని తేల్చిచెప్పారు. ఈ మేరకు ఈ నెల 20న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, వచ్చే నెల 25న చేనేత గర్జన సభకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన్ భవన్‌లో ఎమ్మెల్సీ ఎల్ రమణ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన చేనేత కార్మిక సమస్యలు-ఉద్యమ కార్యాచరణ రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతికుమార్, తెలంగాణ పవర్‌లూమ్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరపాటి రమేశ్ వస్త్ర కార్మికుల పోరాటాలకు సిద్ధపడినట్టు స్పష్టంచేశారు. ఈ పోరాటాలకు వామపక్ష, ఇతర పార్టీలు కూడా మద్దతు ప్రకటించాయని వారు పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతగా ప్రాధేయపడినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం ససేమిరా అంటున్నారని చేనేత సంఘాల నేతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నేత క